ప్రజాశక్తి
గురువారం 04 సెప్టెంబర్ 2025
5
కర్నూలు



జయరాం బహిరంగ క్షమాపణ చెప్పాలి

- సిపిఎం కర్నూలు జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డికి ఫోన్ చేసి బెదిరించిన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బహిరంగ క్షమాపణ చెప్పాలని సిపిఎం కర్నూలు జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం బేతపల్లి గ్రామంలో సోలార్ పేరుతో బలవంతపు భూసేకరణ చేస్తున్న సోలార్ కంపెనీకి వ్యతిరేకంగా రైతులకు అండగా నిలుస్తున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డికి ఫోన్ ద్వారా బెదిరించడం సరైన పద్ధతి కాదని, సోలార్ కంపెనీకి ఊడిగం చేస్తుంటే బహిరంగంగా ప్రజలకు నేను ఊడిగం చేస్తున్నానని చెప్పాలని ఆయన తెలిపారు. చేతనైతే రైతులకు సహాయం చేయాలి చేతకాకపోతే కాళ్లు చేతులు ముడుచుకుని ఇంట్లో కూర్చోవాలి తప్ప రైతులకు అండగా నిలుస్తున్న సంఘాల నాయకుల పై తనకు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. బెదిరిస్తే బెదిరే వాళ్లఎవరూ లేరని ఆయన ఘాటుగా విమర్శించారు. ఇలాంటి కవ్వింపు చర్యలు మానుకోవాలని లేకపోతే ప్రజలే బుద్ధి చెప్తారని గౌస్‌దేశాయి హెచ్చరించారు.

గుమ్మనూర్ జయరాం వ్యాఖ్యలను ఖండించండి

- ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డిపై ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలను ఖండించాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ అన్నారు. తను రోజు భుజించిన ఆహారాన్ని అందించిన అన్నదాతకు అండగా నిలిచిన రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డిని రాయడానికి వీలుకాని భాష వాడటం శోచనీయమని పేర్కొన్నారు. జయరాం మీకు చేతనైతే రైతుల సమస్యలు పరిష్కారం చేసి మన్నన పొందాలని, రైతుల సమస్యలను పరిశీలించడానికి, రైతుల భూములను బలవంతంగా తీసుకుంటుంటే రైతులకు అండగా నిలబడటానికి వెళ్లిన రైతుసంఘం నేత కె.ప్రభాకర్ రెడ్డి పై పరుష పదజాలంతో అనుచితంగా మాట్లాడటం ప్రజా ప్రతినిధిగా తగదని అన్నారు. ఇలాంటి తీరు మార్చుకోవాలని, లేని పక్షంలో రైతుల్ని,ప్రజల్ని సమీకరించి మీ ఇంటి ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మీరు మాట్లాడిన భాషను తక్షణమే పత్రికా ముఖంగా ఉపసంహరించుకోవాలన్నారు. ఇలానే కొనసాగితే కర్నూలు జిల్లా అన్ని ప్రాంతాలలో మీకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజలు ప్రజాతంత్రవాదులు రైతు, ప్రజాసంఘాలు ఖండించాలని కోరారు.

వర్షం వస్తే నిద్ర కరువు..!

• లక్ష్మీ నగర్ వాసుల కష్టాలు • ఇళ్లలోకి నీరు • మురుగు కాలువలు లేక దోమల బెడద
• కెసి కెనాల్ వద్ద పొంచి ఉన్న ప్రమాదం • శుద్ధ వాగు కాలువ పెద్దగా చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వర్షం వస్తే కంటికి కునుకు ఉండదు. ఇళ్లల్లోకి నీళ్లు చేరుతాయి. రోడ్లపై రోజుల తరబడి నీళ్లు పారుతున్నాయి. కర్నూలు నగరంలోని లక్ష్మీనగర్ ప్రజల కష్టాలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రస్తుత మంత్రి, గత ఎమ్మెల్యేలకు, మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని లక్ష్మీనగర్ వాసులు కోరుతున్నారు. ఈనేపథ్యంలో ప్రజాశక్తి ప్రత్యేక కథనం.....



జలమయమైన కాలనీ

కర్నూలు నగరంలోని 24వ వార్డు లక్ష్మీ నగర్ చివరి నాలుగు వీధులలో సుమారు 600 గృహాలలో ప్రజలు నివాసం ఉంటున్నారు. లక్ష్మీనగర్ సుద్ద వాగు ద్వారా వచ్చే వర్షపు నీరు కాలువ పెద్దగా లేక పైప్ లైన్ ద్వారా నీరు వెళ్లక లక్ష్మీ నగర్ చివరి నాలుగు వీధుల్లో రోడ్లపై మోకాళ్లోతు నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడిందంటే సుద్దవాగు చివర కెసి కెనాల్ వద్ద గోడ అడ్డం కట్టడంతో వర్షపు నీరు పైపు లైన్ గుండా అండర్ టర్నల్ ద్వారా నీరు పోక నీరంతా వెనక్కు వచ్చి రోడ్లపై మోకాలు లోతు నీరు నిలుస్తుంది. దీంతో రాత్రిపూట ఆ ప్రాంతం ప్రజలకు కంటికి కునుకు లేకుండా చేస్తుంది. ఇంటిలోకి వచ్చిన నీటిని ఎత్తుపోయడమే పనిగా ఉంటుంది. రెండు మూడు రోజుల వరకు బురదలో రోడ్లపై నడవాల్సిన పరిస్థితి. ఈ దుస్థితి వర్షం పడినప్పుడల్లా ఉంటుంది. పది సంవత్సరాలుగా అధికారులకు విన్నవించినా తాత్కాలిక పనులు చేసి వెళ్లిపోతున్నారు తప్ప శాశ్వతమైన పరిష్కారం చూపడం లేదని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అప్పటి ఎమ్మెల్యే హాఫీస్ ఖాన్, ఎస్‌వి మోహన్ రెడ్డి, ప్రస్తుతం ఉన్న పరిశ్రమల శాఖ మంత్రి పిజి భరత్ కూడా వచ్చి చేసి పోవడం తప్ప ఎవరూ ఈ సమస్యను పట్టించుకోవడంలేదు. ప్రస్తుతం కమిషనర్ అయినా వర్షం పడినప్పుడు మా ప్రాంతానికి వస్తే మా ప్రాంత ప్రజల కష్టాలు కళ్ళారా చూడాలన్నారు. అప్పుడైనా మాపై దయగలిగి వర్షపు నీరు ఇళ్లలో చేరకుండా పరిష్కార మార్గం చూపేందుకు చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామని స్థానికులంటున్నారు. సిఎస్ఐ చర్చి లైన్ ఇండ్లలోకి నీళ్లు వస్తున్నాయి. పట్టణ ప్రణాళిక విభాగం వారు కమిషనర్ లక్ష్మీనగర్, శ్రీ రామ్‌నగర్ ప్రాంతాలను సందర్శించి వర్షపు నీరు సాఫీగా వెళ్ళిపోయే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాల్వ పెద్దగా చేయాలి

- లీలావతి, లక్ష్మీ నగర్



కెసి కెనాల్ వద్ద నిర్మించిన కాల్వ చిన్నగా ఉండడంతో వర్షపు నీరు వెనక్కు వచ్చి ఇండ్లలోకి చేయడమే కాకుండా రోడ్లపై మోకాల్లోతు నీళ్ళు నిలిచి ఉంటాయి. వర్షం వచ్చినప్పుడు అధికారులకు చెప్తే అప్పటికీ తాత్కాలికంగా అడ్డున్నవి తొలగించి నీరు పోయే విధంగా చేసి వెళ్లడం తప్ప శాశ్వతంగా పనిచేయడం లేదు. ఈ పనులు చేయడానికి రాజకీయ నాయకులు అడ్డుపడుతున్నారని తెలిసింది.

కాలువను నీరు పోయేలా చేయాలి

- షేక్ మహబూబ్ బాషా లక్ష్మీ నగర్



ఇల్లు నిర్మించుకోవడానికి స్థలం చిన్నగా ఉండడం చేత రోడ్లపై మెట్లు పెట్టుకోవడం, కాలువ లేకపోవడంతో వర్షపు పడినప్పుడల్లా నడుములోకి నీళ్లు రోడ్లపై ప్రవహిస్తుంటాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పరిశీలించి కాల్వలు , రోడ్లు నిర్మాణం చేసి ఆదుకోవాలి.

పన్నులు కడుతున్నా సమస్యలు పట్టించుకోరా..?

- ఎం.సుజాతమ్మ లక్ష్మీ నగర్



మా వీధిలో సైడ్ కాలువలను నిర్మించి నీరు నిలవకుండా చూడాలి. ఖాళీ ప్రదేశాలు తగ్గు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచి దోమలు నిలయంగా మారాయి. రోడ్లపై నీరు నిలవకుండా చేయాలి. దోమల కాటుతో జ్వరాలు వచ్చి ఆసుపత్రుల పాలవుతున్నాం. పేదలైన మాపై కనికరం చూపి సమస్య పరిష్కారం చేయాలి.

నగరం స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలవాలి

-నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరాన్ని రాష్ట్రంలోనే స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలబెట్టేలా పారిశుధ్య విభాగ సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. బుధవారం ఆయన నగరపాలక సమావేశ భవనంలో శానిటేషన్ ఇస్పెక్టర్లు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు స్మార్టన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగ నివారణ, చెత్త సేకరణ వంటి అంశాలపై ప్రజల్లో విస్తృత చైతన్య కార్యక్రమాలు చేపట్టడంపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుధ్య సిబ్బంది పనితీరు పర్యవేక్షణలో అలసత్వం సహించబోమని, ఎవరి విధుల్లో నిర్లక్ష్యం కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి డివిజన్ పరిశుభ్రతపై శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ట్రేడ్ లైసెన్స్ బకాయిల వసూళ్లలో ఆలస్యం చేయకూడదని, ప్రతి రూపాయి ఆదాయం నగరాభివృద్ధికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఎవరైనా కార్పొరేషన్‌కు నష్టం వాటిల్లే పనులు చేస్తే, వారి వేతనం నుండి ప్రజాధనం వసూలు చేస్తామన్నారు. ప్రజల్లో అవగాహన పెంపొందించి, కర్నూలు నగరాన్ని స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలబెట్టడం అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని, వస్తే 24 గంటల్లో పరిష్కరించాలని సూచించారు. సిబ్బంది ఇచ్చే సూచనలు, సమస్యలను పరిగణలోకి తీసుకుని పరిష్కరిస్తామని, ఆశించిన స్థాయిలో ఫలితాలు లేకపోతే చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, సిఎంఎం భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథ్

నిమజ్జనానికి నిబంధనలు పాటించాలి

- నేటి గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌పి -డిజెలు అధిక సౌండ్‌తో పరిమితిలోపే ఉండాలి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పోలీసులు కేటాయించిన నిమజ్జన రూట్ లోనే ఊరేగింపు వాహనాలు వెళ్లాలని డిజేలు పరిమితి సౌండ్ మాత్రమే ఉండాలని, వినాయక ఉత్సవాల్లో ఆఖరు ఘట్టమైన గణేష్ నిమజ్జనం జిల్లా కేంద్రంలో సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులకు తెలిపారు. భద్రత ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. గురువారం నిమజ్జన నిర్వహించే కెసి కెనాల్ , వినాయక్ ఘాట్ పరిసర ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. గణేష్ నిమజ్జనం సంధర్భంగా వినాయక విగ్రహాలు బయలుదేరే మొదటి రాంబోట్ల దేవాలయం, బాదం మాస్క్ , కింగ్ మార్కెట్ , కొండారెడ్డి బురుజు , అంబేద్కర్ సర్కిల్, రాజ్ విహార్ మీదుగా వెళ్లే వినాయక విగ్రహాల ఊరేగింపు ప్రాంతాలను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. జిల్లా ఎస్‌పి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. విపరీతమైన హోరెత్తించే సౌండ్‌తో ఉండే డిజేలకు నిమజ్జనానికి అనుమతి ఉండదన్నారు. పరిమితి సౌండ్ మాత్రమే ఉండాలన్నారు. కర్నూలు పట్టణం నుండి నిమజ్జనానికి వచ్చే వినాయక విగ్రహ వాహన డిజేలను రాజ్ విహార్ మీదుగా గవర్నమెంట్ హాస్పిటల్ – ఎన్టీఆర్ విగ్రహం సర్కిల్ వరకు మాత్రమే డిజేలకు అనుమతి ఉంటుందని, నిమజ్జన ఘాట్ వరకు లేదన్నారు. నంద్యాల చెక్ పోస్టు వైపు నుండి వచ్చే వినాయక విగ్రహ వాహన డిజేలను గాయత్రి ఎస్టేట్ క్లాక్ టవర్ వరకు మాత్రమే డిజేలకు అనుమతి ఉంటుందని, నిమజ్జన ఘాట్ వరకు అనుమతి లేదన్నారు. అర్ధరాత్రి 12 దాటిన తర్వాత ఎలాంటి డిజేలకు అనుమతి లేదన్నారు. పోలీసు శాఖ తోపాటు, మునిసిపాలిటి, రెవెన్యూ, ఇరిగేషన్, ఎక్సైజ్, విద్యుత్ , అగ్నిమాపక శాఖలతో సమన్వయంతో అందరూ పని చేస్తున్నామన్నారు. బ్యారికేడింగ్, క్రేన్లు, గజ ఈతగాళ్లను, లైటింగ్ ఏర్పాట్లు పటిష్టంగా ఏర్పాటు చేశా మన్నారు. ఎవరూ కూడా పోలీసుల నిబంధనలు ఉల్లంఘించ రాదన్నారు. పోలీసులు కేటాయించిన నిమజ్జన రూట్ లోనే ఊరేగింపు వాహనాలు వెళ్లాలన్నారు.వినాయక నిమజ్జనం ఊరేగింపు సమయంలో వర్షం ఎక్కువగా పడి ఇబ్బందులు ఎర్పడితే వినాయక్‌ఘాట్‌కు రాకుండా మీ ఏరియాలలో పోలీసు, రెవిన్యూ శాఖలు ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రాంతాలలో వెళ్ళి విగ్రహాలను నిమజ్జనం చేయవచ్చన్నారు. ఇతర వాహనాలు, ఆర్‌టిసి బస్సుల ట్రాఫిక్ మళ్లింపు మంగళవారం ప్రకటించిన ప్రకారం ఫాలో కావాలన్నారు. కర్నూలు డిఎస్‌పి బాబు ప్రసాద్, సిఐలు తేజోమూర్తి, కేశవరెడ్డి, నాగరాజా రావు, మన్సురుద్దీన్ , శేషయ్య, పార్థసారథి పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ, పోలీసు అధికారులు

నిమజ్జనం శోభాయాత్రకు విద్యుత్ ఏర్పాట్లు పూర్తి

కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరంలో గురువారం జరిగే గణేష్ నిమజ్జనం , శోభాయాత్ర సందర్భంగా విద్యుత్ శాఖ కర్నూలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని విద్యుత్ ఎస్ఇ ఎం.ఉమాపతి తెలిపారు. ఈ శోభాయాత్రకు విద్యుత్ శాఖ సుమారు 200 మంది విద్యుత్ సిబ్బందిని ఏర్పాటు చేశామని, శోభాయాత్ర సజావుగా జరగడానికి కర్నూలు నగరంలో సుమారు రూ.కోటి 25 లక్షలతో నగరంలో నాలుగు టవర్లు 110- 11 మీటర్ల పోల్స్ , 106-9.1 మీటర్ల పోల్స్ వేశామన్నారు. బుధవారం స్థానిక పవర్‌హౌస్ కాంపౌండ్‌లో కర్నూలు జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎం.ఉమాపతి కర్నూలు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శేషాద్రి, వారి సిబ్బంది తో సమావేశం నిర్వహించారు. ఎస్ఇ డ్యూటీ ఆఫీసర్స్, సిబ్బందికి గణేష్ ఊరేగింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. గణేష్ శోభాయాత్ర జరుగు కూడలి, మెయిన్ రోడ్లలో వర్టికల్ క్లియరెన్స్, 11 కెవిఎల్‌టి లైన్స్ అత్యవసర పరిస్థితులలో ఆఫ్‌చేసి విగ్రహాలను దాటించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు నిమజ్జనం పూర్తి అయ్యేవరకు ప్రతి వినియోగదారుడికి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రతి స్టాఫ్ డ్యూటీలోనే ఉండాలని సూచించారు. సిబ్బంది తమ టి అండ్ పి టూల్స్, హెల్మెట్ గ్లౌజు ఫీజు వైరు, ఎర్త్ రాడ్స్, టార్చ్ లైట్ ఉండాలి. ఐడి కార్డ్స్ ఆప్రాన్‌లు ధరించండి. మినిట్‌టు మినిట్ ఇన్ఫర్మేషన్ ఇంట్రప్షను పై అధికారులకు తెలిపారు. విద్యుత్ ఎస్ఇ ఎంఉమాపతి, కర్నూలు టౌన్ ఇఇ శేషాద్రి , డి ఇఇ డి1 నాగ ప్రసాద్ , డిఇఇ డి టు కర్నూలు డిఇఇ చంద్రమోహన్ , కర్నూలు రూరల్ డిఇఇ సుబాన్, కర్నూలు టౌన్ డివిజన్ ఎఇలు సిబ్బంది పాల్గొన్నారు. ముఖ్యముగా శోభాయాత్ర సమయంలో అత్యవసర పరిస్థితులలో భద్రతా కారణాల వలన అవసరమైనప్పుడు కొన్ని ఏరియాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని అని తెలుపుతూ వినియోగదారులు సహకరించావలని కోరారు. కంట్రోల్ రూమ్ నెంబర్ ఫోన్ నెంబర్ 08518-221919.

ఆటోడ్రైవర్లను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



మాట్లాడుతున్న ప్రభాకర్

ఆటో డ్రైవర్లను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని సిఐటియు జిల్లా అధ్యక్షుడు పిఎస్ రాధాకృష్ణ విమర్శించారు. బుధవారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమాజంలో వారు మాట్లాడుతూ ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్స్ రద్దు చేయాలని, ఉచిత బస్సు వల్ల నష్టపోయిన డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని సోమవారం జరిగే జిల్లా వ్యాప్త ఆందోళనలో ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్స్ వల్ల, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 8న జిల్లా కలెక్టరేట్ ముట్టడి , అన్ని మండల కార్యాలయాల ముందు జరుగు ధర్నా కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు రవాణా డ్రైవర్లు హాజరుకావాలని కోరారు. ఎటిసి సెంటర్లను రద్దుచేసి పాత పద్ధతిలోనే ఆర్‌టిఓ ఆఫీస్ లో ఎఫ్సీలను అనుమతించాలన్నారు. వాహన మిత్ర రూ.25 వేలు ఇవ్వాలని, జీవో నెంబర్ 21 రద్దు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న జరిగే జిల్లా కలెక్టరేట్ ముట్టడి , జిల్లాలోని అన్ని మండల కార్యాలయాల ముందు జరిగే ధర్నా కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, ఇతర రవాణా రంగ డ్రైవర్లు పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. జిల్లా ఆటో యూనియన్ నాయకులు మహమూద్, హుస్సేన్ వలి పాల్గొన్నారు.

ఇద్దరికి రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్ :


జిల్లాలోని ఇద్దరు ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకోనున్నారు. కర్నూలు నగరంలోని స్కూల్ అసిస్టెంట్ తెలుగు సబ్జెక్టుకు చెందిన ఉపాధ్యాయుడు ముత్తుకూరు గోపాలచార్యులు, పత్తికొండకు చెందిన ఎస్‌జిటి ఉపాధ్యాయులు వినుత అవార్డును అందుకోనున్నారు.

కర్నూలులో నేడు పాఠశాలలకు సెలవు

కర్నూల్ నగరంలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు సెలవు ప్రకటిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు నగరంలో వినాయక నిమజ్జనం నేపథ్యంలో అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు.

యువకుడి దారుణహత్యా

ప్రజాశక్తి-ఆస్పరి



మండల పరిధిలోని తొగలగల్లు గ్రామానికి చెందిన గొల్ల అహోబిలం (28)ను దారుణంగా హత్య చేసిన సంఘటన బుధవారం రాత్రి తోగలగల్లులో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గొల్ల రామకృష్ణారెడ్డి, హనుమంతమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు రెండో కుమారుడైన గొల్ల అహోబిలం కలపరి గ్రామంలో ఉన్న భార్య దగ్గరికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా పోలమేర మధ్యలో చెట్ల పొదల్లో గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి పడేసి వెళ్లినట్లు సమాచారం. మృతునికి భార్య గంగమ్మ, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రైతు బజార్ ప్రారంభించడంలో నిర్లక్ష్యం వీడాలి

డివైఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



రైతు బజారు ప్రారంభించాలని ధర్నా చేస్తున్న డివైఎఫ్ఐ, ఐద్వా,సిఐటియు

కర్నూలు నగరం కల్లూరు అర్బన్ 32వ వార్డ్ గోవర్ధన్‌నగర్ ప్రాంతంలో నిర్మించిన రైతు బజార్ ను ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం డివైఎఫ్ఐ, ఐద్వా, సిఐటి యు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రైతుబజార్ వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. సిఐటియు నాయకులు సుధాకరప్ప, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి హుసేన్ బాషా, ఐద్వా స్థానిక కార్యదర్శి లక్ష్మి బాయ్ మాట్లాడుతూ 32వ వార్డ్ లో అనేక పోరాటాలు సాగించడం ద్వారా ప్రభుత్వాలు రైతుబజార్‌ను మంజూరు చేశారని అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో అదిగో రైతు బజార్, ఇదిగో రైతు బజార్ అంటూ ప్రజలను తీవ్రంగా మోసం చేసిందని వారు విమర్శించారు. గత ప్రభుత్వం చివరి సమయంలో నిర్మాణం చేపట్టి చేతులు దులుపుకుందని ఏద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం గత ఎన్నికల ముందు రైతు బజార్‌ను అడ్డుగా పెట్టుకుని ప్రజల ఓట్లు దండుకుని గెలిచారని చెప్పారు. కనీసం ఎన్నికల ముందు వార్డ్ ప్రజలకు ఇచ్చిన హామీ రైతుబజార్ ను ప్రారంభించడంలో కూటమి ప్రభుత్వానికి, ప్రస్తుత ఎమ్మెల్యే, అధికారులకు సైతం చేతులు రావడం లేదని మండిపడ్డారు. ఈ ప్రాంతంలో ముజఫర్ నగర్, మాదిరాజ్ నగర్, సుందరయ్య నగర్, గంగావతినగర్, గోవర్ధన్ నగర్, ఫరూక్‌నగర్, అయ్యప్పస్వామి నగర్, ఉమా మహేశ్వరీ నగర్, చింతలముని నగర్,కన్యకా పరమేశ్వరి నగర్,ఇండస్ట్రియల్ ఎస్టేట్, వంటి కాలనీలే కాకుండా పందిపాడు,పందిపాడు ఇందిరమ్మ కాలనీ, లక్ష్మీపురం, బస్తిపాడు, బొల్లవరం, పూసులూరు వంటి చుట్టపక్కల గ్రామాల రైతులు,ప్రజలు రైతుబజార్ పట్ల ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. రైతుబజార్ ప్రారంభం అయితే ఆర్థికంగా కొంత ఉపశమనం కలుగుతుందని ఆశిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఎమ్మెల్యే, అధికారులు స్పందించి రైతుబజార్ ను ప్రారంభించాలని, లేనిపక్షంలో ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. 32వ వార్డ్ నాయకులు విజయ్ కుమార్,అక్బర్, నాయకులు శ్రావణ్, ధనుష్, సురేష్, ఐద్వా నాయకులు శారదమ్మ, కన్యక, దానమ్మ,ఈశ్వరమ్మ,హమాలీ సంఘం నాయకులు రాజు,శరత్, రాము, జయరాజు,మహిళలు పాల్గొన్నారు.

నేడు గణేష్ నిమజ్జనం

-వినాయక ఘాటు వద్ద ఆరు క్రేన్లు 8 ఘాట్ల ఏర్పాటు

-1200 విగ్రహాలు నిమజ్జనానికి సిద్ధం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరంలో అత్యంత వైభవోపేతంగా జన సందోహం మధ్య నేడు వినాయక నిమజ్జోత్సవ కార్యక్రమం జరగనుంది. ప్రతి ఏటా గణేష్ నిమజ్జోత్సవం రాష్ట్రంలో ఓ ప్రత్యేక తను కర్నూలు నగరం సంతరించుకుంది. ఆగస్టు 27న వినాయక చవితి నాటి నుంచి విగ్రహాలు ఏర్పాటుచేసి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవంగా నిర్వహించుకున్నారు. నేడు తొమ్మిదో రోజు గణనాథుని నిమజ్జనం చేసేందుకు కర్నూలు నగరంలోని కెసి కెనాల్ ఒడ్డున ఉన్న వినాయక ఘాటు సమీపంలో ప్రభుత్వం వివిధ విభాగాల సహకారంతో ఉత్సవ ఏర్పాట్లను ఘనంగా చేశారు. ఈ మేరకు విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఎనిమిది ఘాట్లతో పాటు ఆరు భారీ క్రేన్లను ఏర్పాటు చేశారు. నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి మొదట ఉదయం 9 గంటలకు కుమ్మరి వీధిలోని రాంబోట్ల దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన ఘననాథుడికి పూజలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు విగ్రహం ఘాటుకు చేరుకొని ప్రప్రదంగా విగ్రహాన్ని నిమజ్జనం చేస్తారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు మున్సిపాలిటీ, పోలీసు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఇతర విభాగాల సమన్వయంతో ఏర్పాట్లను సిద్ధం చేశారు. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ముఖ్య అతిథులుగా మంత్రి టీజీ భరత్, ఎంపీలు బస్తిపాటి నాగరాజు బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి, పార్థసారథి, జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాష, డిఐజి కోయ ప్రవీణ్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, నగరమేయర్ బి వై రామయ్య, ఇతర ప్రజా ప్రతినిధులతో పాటు మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేశు, భాగ్యనగర్ గణేష్ మహోత్సవ సమితి గౌరవ అధ్యక్షులు జి రాఘవరెడ్డి, వివిధ కార్పొరేటర్లు నాయకులతో కలసి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.



వినాయక ఘాటు వద్దనిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

అడిషనల్ డిఎంఇ హోదా మరింత బాధ్యత పెంచింది

-ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

-అడిషనల్ డి ఎం ఈ పలువురికి పలువురి సన్మానం

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల రెగ్యులర్ సూపరింటెండెంట్ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (అడిషనల్ డిఎంఇ) గా పదోన్నతి పొందిన సందర్భంలో డాక్టర్ కె.వెంకటేశ్వర్లును పలువురు కలిసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఈ పదోన్నతి నాకు లభించడం పట్ల ఆనందంగా ఉందన్నారు. ఇది నా బాధ్యతను మరింతగా పెంచిందన్నారు. పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మరింతగా కృషి చేస్తానని అన్నారు. ఆసుపత్రి అభివృద్ధి సిబ్బందికి అనుకూల వాతావరణం కల్పించడంలో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించడమే నా ప్రధాన లక్ష్యమన్నారు. వైద్య సేవలలో నాణ్యతను పెంపొం దించడానికి సమిష్టిగా పని చేస్తామని పేర్కొన్నారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ఇతర అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనస్థీషియా టెక్నీషియన్ల అసోసియేషన్ వారు శాలువా పూల బొకేలతో ఘనంగా సన్మానించారు. ఆసుపత్రి ఇన్చార్జి సిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, ఆసుపత్రి ఎడి, మల్లేశ్వరమ్మ, ఎఒ, శ్రీనివాసులు, అకౌంటెంట్, లతీఫ్‌బేగ్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న వైద్యులు



స్థానిక అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య, ఆర్‌డిఒ సందీప్‌కుమార్

సి బెళగల్ బస్టాండ్ అభివృద్ధికీ 'గ్రీన్ సిగ్నల్ '

-సులబ్ కాంప్లెక్స్‌తో పాటు రోడ్డు విస్తరణకు చర్చలు
-జె సి, ఆర్‌డిఒల పూర్తి స్థాయి ఆదేశాలు జారీ

ప్రజాశక్తి-సి బెళగల్

సి.బెళగల్ మండల కేంద్రంలో ఎన్నో ఏళ్లుగా కాంక్షిస్తున్న బస్టాండ్ అభివృద్ధి, సులభ కాంప్లెక్స్ నిర్మాణం, హైస్కూల్ నుండి పలుకుదొడ్డి ఎక్స్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ, సిసి రోడ్డు పనులు, అక్రమ బంకుల తొలగింపు వంటి చర్యలకు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ పడింది. బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, ఆర్‌డిఒ కిడారి సందీప్‌కుమార్, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపిడిఒ రాణెమ్మ, ఇంజినీర్లు వెంకట ప్రకాష్, సుమంత్ తదితరుల సమక్షంలో బస్టాండ్‌ను, రోడ్డును, అక్రమణలను , చౌక ధరల దుకాణాలను, ఎరువుల మందుల, విత్తన దుకాణాలను పరిశీలించారు. చేపట్టారు. అనంతరం పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు జెసికి, ఆర్‌డిఒకు ఎన్నో ఏళ్లుగా బస్టాండ్ ఆవరణంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడిందని వివరించారు. మారుమూల గ్రామాల ప్రజలు, ప్రయాణికులు, వాహనాల రాకపోకలు మండల కేంద్రానికి అధికం కావడంతో ఇరుకుమయంగా మారిన రోడ్లతో, బస్టాండ్ అక్రమణతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. ప్రధానంగా మహిళలు, బాలికలు, వృద్ధులు, ఆయాగ్రామాల ప్రయాణికులు మరుగుదొడ్ల కోసం నానాపాట్లు పడుతుండగా ప్రజాసంఘాల, ఆయా పార్టీల నాయకుల కృషి ఫలితంగా బుధవారం జిల్లా అధికారులు ఈ నెల 10 నుండి పనులు ప్రారంభం చేయాలని పూర్తి స్థాయిలో ఆదేశాలు జారీ చేశారు. ఇక మండల స్థాయిలో అధికారులు అలసత్వం పాటు లేకుండా పనులు పూర్తి చేస్తే సి బెళగల్ మండల కేంద్రంలో రోడ్లు, బస్టాండ్ రూపురేఖలు మారి కొత్త శోభను సంతరించుకొనేందుకు అవకాశం ఉందన్నారు. పనులు చేపట్టేందుకు తీసుకున్న చర్యలకు పలువురు, ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ల నియామకం

ప్రజాశక్తి కర్నూల్ క్రైమ్

కూటమిరాష్ట్ర ప్రభుత్వం పలు కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమించింది. ఎపి ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కు డైరెక్టర్‌గా నగరూరు రాఘవేంద్ర(కర్నూలు) జె. నాగ ముని (పాణ్యం) , ఎపి కుమ్మరి శాలివాహన వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పిబివి సుబ్బయ్య (కర్నూలు), కె.సుధాకర్ (డోన్), ఎపి ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ కు డైరెక్టర్గా భీమిశెట్టి మనోజ్ కుమార్ (కర్నూలు), ఏపీ స్టేట్ అగ్రికల్చరల్ మిషన్ డైరెక్టర్‌గా వి లక్ష్మీదేవి (పాణ్యం), ఎపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కృష్ణయ్య(ఆదోని) వీరిని ప్రభుత్వం నియమించింది.





కార్మిక సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - హాలహర్వి

కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.అంజిబాబు డిమాండ్ చేశారు. బుధవారం హాలహర్విలో సిఐటియు మండల మహాసభలు కె.కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అంజిబాబు, సిఐటియు తాలూకా నాయకులు కెపి.నారాయణ స్వామి, మండల నాయకులు ప్రేమ్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడారు. కార్మిక సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తూ... పని భారం పెంచుతూ వెట్టిచాకిరి చేయిస్తున్నాయని విమర్శించారు. కనీస వేతనాలు అమలు చేయడంలో నిర్లక్ష్య వహిస్తున్నాయని, వీటిపై కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని తెలిపారు. ఒకవైపు సంక్షేమ పథకాలని చెప్పి అధిక ధరలు, నిత్యావసర వస్తువులు, విద్యుత్ చార్జీల పేరుతో కార్మికులు, ప్రజలపై భారాలు వేసి దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఈ దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని కోరారు.

చదువుతోనే మహిళలకు భవిష్యత్తు

- ఎంపిడిఒ అల్లా బకాష్, అక్షర ఆంధ్ర సూపర్‌వైజర్ రమణయ్య



అక్షర ఆంధ్ర బుక్ లెట్‌ను విడుదల చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

ఆధునిక కాలంలో ప్రతి మహిళకూ చదువు తప్పనిసరి అని, చదువు ఉంటేనే భవిష్యత్తు బాగుంటుందని ఎంపిడిఒ అల్లా బకాష్, అక్షర ఆంధ్ర సూపర్‌వైజర్ రమణయ్య సూచించారు. బుధవారం స్త్రీ శక్తి భవనంలో ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమంపై వాలంటీర్ టీచర్ల శిక్షణను వెలుగు ఎపిఎం శివయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపిడిఒ అల్లా బకాష్, ఎంఇఒలు సావిత్రమ్మ, ఫరూక్ హాజరయ్యారు. జిల్లా వయోజన విద్యా సూపర్‌వైజర్ కె.రమణయ్య ఆధ్వర్యంలో మహిళలకు అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. 2,100 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేస్తున్నట్లు తెలిపారు. వాలంటీర్ టీచర్లకు గ్రామాల్లో ఇచ్చిన లక్ష్యం ప్రకారం పది మంది చొప్పున చదువు చెప్పాలని, మండలంలో నిరక్షరాస్యులకు చదవడం, రాయడం, చిన్నచిన్న లెక్కలు చేయడం నేర్పించాలని సూచించారు. ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత గురించి అవగాహన కల్పించారు. చదువు నేర్చుకున్న నిరక్షరాస్యులైన మహిళలకు మార్చిలో ఎన్ఐఒఎస్ పరీక్ష నిర్వహిస్తామని, ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్ ఇస్తామని తెలిపారు. వెలుగు సిసిలు లక్ష్మన్న, శ్రీనివాసులు, శారద, వెంకటేశులు పాల్గొన్నారు.

పైకప్పు పెచ్చులూడి

ముగ్గురు విద్యార్థులకు గాయాలు

- విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ పరామర్శ

ప్రజాశక్తి -ఆలూరు



విద్యార్థులను పరామర్శిస్తున్న నాయకులు

ఆలూరు 4వ వార్డు ఎంపిపి పాఠశాలలో బుధవారం పాఠశాల పైకప్పు పెచ్చులూడి ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. పాఠశాలలో ఉదయం 2, 3వ తరగతి విద్యార్థులు చదువు కుంటుండగా ఒక్కసారి పెచ్చులూడి మీద పడ్డాయి. విద్యార్థిని జైష్ణవి తలకు, నీలిమ, చరణ్ రాజుకు చేతి వేళ్లకు గాయాలయ్యాయి. ఉపాధ్యాయులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి, విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు బసవరాజు సంఘటన స్థలాన్ని పరిశీలించి, విద్యార్థులను పరామర్శించి బ్రెడ్లు, పండ్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో నిత్యం ఎక్కడో ఒక చోట పైకప్పు పెచ్చులూడి ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వాలు, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. పాఠశాలలకు మెయింటనెన్స్ కోసం నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాలని కోరారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన చికిత్స చేయించాలని తెలిపారు.

పిఆర్‌సి అమలు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆస్పరి

పిఆర్‌సి అమలు చేసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు దావీదు, జిల్లా మాజీ అధ్యక్షులు ఎల్లప్ప డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రత్యేక యాప్‌లను రద్దు చేయాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరారు. జిల్లా కార్యదర్శి దేవపాల్, నరసింహులు, నాయకులు బాబు, రంగన్న, పవన్, ఖలీల్, మోద్దీన్ బాష, రంగన్న, లక్ష్మణ, హనీఫ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైయినేజీలు కరువు

- దుర్భరంగా చేనేత కాలనీ
- పాముల బెడదతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం : వీధి ప్రజల ఆవేదన

ప్రజాశక్తి - నందవరం

రోడ్లు, డ్రైయినేజీలు లేక నాగలదిన్నె గ్రామంలో ఉన్న చేనేత కాలనీ దుర్భరంగా తయారయింది. పాముల బెడదతో ఇళ్లలో ఉండలేకపోతున్నామని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. సమస్యను పరిష్కరించడంలో అధికారులు, పాలకులు విఫలమవుతున్నారు.

2009వ సంవత్సరం వచ్చిన వరదల ధాటికి గ్రామంలో ఉన్న చేనేతలు ఆవాసాలను కోల్పోయారు. వారికి నివాసాలను కల్పించాలన్న ఉద్దేశంతో ఎమ్మిగనూరుకు వెళ్లే దారిలో 360 కుటుంబాలకు స్థలాలను కేటాయించారు. అందులో చాలామందికి ప్రభుత్వం ఇళ్లను నిర్మించి ఇచ్చింది. ఆ కాలనీ ఏర్పడి సుమారు 13 సంవత్సరాలు కావస్తోంది. కాలనీలో మాత్రం రోడ్లు, డ్రైయినేజీ వ్యవస్థను నిర్మించడంలో ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని కాలనీవాసులు విమర్శిస్తున్నారు. ఎన్నికల సమయంలో వీధిని సందర్శించి.. ఆ సమయంలో హామీలు ఇస్తారు.. తప్ప మిగిలిన సమయంలో మా కాలనీ వారికి గుర్తు రాదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం వీధి దాటి వెళ్లడానికి కూడా వీలుకాని విధంగా నీరు నిలుస్తోంది. వీధిలో ఉన్న ప్రధాన రహదారి బురదమయంగా మారింది. వాహనాలు వెళ్లడానికి, మనుషులు నడవడానికి వీల్లేకుండా ఉంది. పిల్లలు పాఠశాలలకు కూడా వెళ్లడానికి మొగ్గు చూపడం లేదు. వీధిలో నిలిచిన నీరు ఊట రూపంలో ఇళ్లలోకొస్తున్నాయి. పాములకు కాలనీ నిలయంగా మారింది. దోమల సంచారం వల్ల విష జ్వరాలు సంభవిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు.



బురదమయమైన రోడ్డును చూపుతున్న కాలనీ వాసులు

సమస్య పరిష్కారానికి కృషి

- నౌసన్న, పంచాయతీ కార్యదర్శి, నాగలదిన్నె గ్రామం

చేనేత కాలనీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. కొద్దిరోజుల క్రితమే కాలనీలో ప్రధాన రోడ్డుపై ఉన్న ముళ్ల చెట్లను తొలగించాం. రోడ్డు, డ్రైయినేజీల కోసం ప్రతిపాదనలు పంపాం. నాగలదిన్నె గ్రామాభివృద్ధికి నిధులు వస్తే ముందుగా చేనేత కాలనీ రోడ్డు, డ్రైయినేజీలకు వినియోగిస్తాం.

మగ్గం గుంతలోకి నీరు వస్తున్నాయి...

- సరోజ, నాగలదిన్నె గ్రామం



వర్షం కురిసిన సమయంలో నీరు ఎటూ వెళ్లే దారి లేక ఇళ్ల ముందే నిలుస్తోంది. ఆ నీరు తిరిగి మా ఇంటి మగ్గం గుంతలో ఊట రూపంలో వస్తోంది. వాటిని బకెట్లతో తోడి బయటకు వేసినా తిరిగి అలానే వస్తున్నాయి. ఏమీ చేయలేని స్థితిలో ఉన్నాం. నిలిచిన నీరు వల్ల దుర్వాసన రావడంతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం.

పట్టపగలే ఇళ్లలోకి పాములు వస్తున్నాయి

- గోకారమ్మ, చేనేత కాలనీ



నీరు, చెట్లతో కాలనీ అడవిలా ఉంది. పాములు లెక్కలేనన్నీ ఉన్నాయి. అవి స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి. పట్టపగలే ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయి. పాముల భయంతో ఇళ్లలో ఉండాలంటే భయంగా ఉంది.

సదుపాయాల కల్పనలో ప్రభుత్వాలు విఫలం

- చేనేత జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లేష్



మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయి. కాలనీలో నివాసం ఉండడానికి ప్రజలు మొగ్గుచూపడం లేదు. సురక్షితమైన ప్రదేశంలోకి వెళ్లి ప్రజలు జీవనాన్ని కొనసాగిస్తున్నారు. మౌలిక సదుపాయాలు కల్పించి పేదల సంతోష జీవితానికి కూటమి ప్రభుత్వం సహకరించాలి.

హిందీ ఉపాధ్యాయుడు లేక

విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 920 మంది విద్యార్థులు విద్యాభ్యాసం అభ్యసిస్తున్నారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న హిందీ ఉపాధ్యాయునికి బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. హిందీ ఉపాధ్యాయుడు రిలీవ్ రాకపోయినా కల్లూరు మండలం నాయకల్లు ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. హిందీ ఉపాధ్యాయుడు వచ్చే వరకు దేవనకొండ పాఠశాలలోనే డిప్యూటేషన్‌పై నాలుగు రోజులు విధులు నిర్వర్తించాల్సిన నిబంధన ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. హిందీ సబ్జెక్టులో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. సంబంధిత విద్యాశాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని హిందీ ఉపాధ్యాయుడు పాఠశాలలో చేరే వరకు గత హిందీ ఉపాధ్యాయుని డిప్యూటేషన్‌పై కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.





మాట్లాడుతున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి పాదయాత్రలు

- సిపిఎం జిల్లా నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని రెవెన్యూ డివిజన్ పరిధిలో సాగు, తాగునీరు, వలసలు, ఉపాధి అంశాలపై రాబోయే రోజుల్లో పాదయాత్రలకు రూపకల్పన చేస్తున్నట్లు సిపిఎం జిల్లా నాయకులు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, కె.వెంకటేశులు, ఎమ్.డి.అంజిబాబు మాట్లాడారు. ఈనెల 6, 7వ తేదీల్లో పట్టణంలోని మెట్రో ఫంక్షన్ హాలులో సిపిఎం జిల్లాస్థాయి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, తిప్పన పాల్గొన్నారు.

జయరామ్.. నోరు అదుపులో పెట్టుకో..!

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంజిబాబు

ప్రజాశక్తి- ఆలూరు

సంస్కారం లేని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లడాలని, అనుచిత వ్యాఖ్యలు ఎమ్మెల్యే స్థాయికి తగదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎమ్.డి.అంజిబాబు విమర్శించారు. బుధవారం ఆలూరు జ్యోతిబసు భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశానికి అన్నం పెట్టే అన్నదాతకు అండగా నిలిచిన రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డిని దుర్భాషలాడడం తగదని తెలిపారు. చేతనైతే రైతు సమస్యలను పరిష్కరించి మన్ననలు పొందాలని, సమస్యలను పరిశీలించడానికి, రైతుల భూములను బలవంతంగా సోలార్ కంపెనీలు తీసుకుంటుంటే రైతులకు అండగా నిలిచేందుకు వెళ్లిన కె.ప్రభాకర్ రెడ్డిపై పరుష పదజాలంతో అనుచితంగా మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజా ప్రతినిధిగా గుమ్మనూరు జయరామ్ తీరు మార్చుకోవాలని, లేకపోతే రైతులను, ప్రజలను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి తదితర ప్రాంతాల్లో రైతుల భూములను బలవంతంగా తీసుకుంటుంటే ఒక్క మాట మాట్లాడని గుమ్మనూరు రాష్ట్రంలో బలవంతపు సేకరణకు వ్యతిరేకంగా పోరాడే రైతుసంఘం రాష్ట్ర నాయకులను ఇష్టమొచ్చినట్లు తూల నాడటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, మండల నాయకులు మైనా, ఈరన్న, గోపాల్ పాల్గొన్నారు. **దేవనకొండ** సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, సీనియర్ నాయకులు యూసుఫ్ బాష, రైతు సంఘం మండల కార్యదర్శి కోటకొండ సూరి మాట్లాడారు. ఎమ్మెల్యే జయరాం తప్పును గుర్తించి రైతులకు, రైతు సంఘం నాయకులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు, వ్యకాస, సిఐటియు నాయకులు నాగేష్, కౌలుట్లయ్య, పాండురంగడు, రంగన్న, రాజు, రంగడు, రామాంజనేయులు, రాము పాల్గొన్నారు. **ఆస్పరి** సుందరయ్య భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వ్యకాస బాలకృష్ణ, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మధు రెడ్డి, రంగస్వామి, రామాంజనేయులు మాట్లాడారు. రైతుసంఘం రాష్ట్ర నాయకులు ప్రభాకర్ రెడ్డిని ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యకాస, రైతు సంఘాల నాయ కులు వెంకట రాముడు, భీమప్ప, పురుషోత్తం, డివైఎఫ్ఐ నాయ కులు రామాంజనేయులు, కృష్ణ పాల్గొన్నారు.



ఆలూరులో మాట్లాడుతున్న అంజిబాబు



దేవనకొండలో మాట్లాడుతున్న వీరశేఖర్

ఉరేసుకుని

యువకుని ఆత్మహత్య

- ప్రేమ వ్యవహారమే కారణమా..?

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



వీరేంద్ర (ఫైల్)

పట్టణంలోని సోమప్ప నగర్ సమీపంలో ఉన్న లక్ష్మీనరసింహ కాలనీకి చెందిన బోయ వీరేంద్ర (20) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం ఉదయం ఆత్మహత్య దృశ్యాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి... లక్ష్మీ నరసింహ కాలనీకి చెందిన బోయ రాజు కుమారుడు బోయ వీరేంద్ర ఆటో డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నారు. పట్టణంలోని కోసిగి రోడ్డు పక్కన ఉన్న యల్లంబీడు కాలనీకి చెందిన అదే సామాజిక వర్గానికి చెందిన అమ్మాయితో ఉన్న ప్రేమ వ్యవహారమే ఆత్మహత్యకు కారణమని కాలనీ వాసులు చర్చించుకుంటున్నారు. గత రెండు రోజుల క్రితం అమ్మాయి తండ్రి వీరేంద్రపై దాడి చేసి చంపేస్తానని బెదిరించినట్లు తెలిసింది. అమ్మాయి కూడా మంగళవారం అర్ధరాత్రి సమయంలో అబ్బాయి సెల్‌ఫోన్‌కు ఫోన్ చేసి మాట్లాడినట్లు సమాచారం. అర్ధరాత్రి దాటిన తర్వాత వీరేంద్ర తన ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆత్మహత్య చేసుకున్న సమయంలో వీరేంద్ర తల్లిదండ్రులు ఇంట్లో లేరు. రెండు రోజుల క్రితం వారు అరుణాచలం వెళ్లినట్లు తెలిసింది. వీరేంద్ర మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీటి కుంటిలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - చిప్పగిరి



సోమశేఖర్ (ఫైల్)


చిప్పగిరికి చెందిన యువకుడు వేపమాను సోమశేఖర్ (31) ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి బుధవారం మృతి చెందారు. స్థానికుల వివరాల మేరకు... చిప్పగిరి గ్రామానికి చెందిన వేపమాను లక్ష్మన్న, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు సోమశేఖర్ రోజూలాగే సెంట్రింగ్ పని నిమిత్తం గ్రామంలో పనికి వెళ్లారు. అక్కడి నుంచి బహిర్భూమికి వెళ్లిన సోమశేఖర్ ఎంత సేపటికీ రాకపోవడంతో తోటి కూలీలు, ఇంటి వారు వెతికారు. అటుగా వెళ్తున్న ఓ మహిళ యువకుడు నీటికుంటలో పడిపోయాడంటూ స్థానికులకు సమాచారం అందించారు. స్థానికులు హుటాహుటినా వెళ్లి నీటి కుంటలో పడి ఉన్న యువకుడు సోమశేఖర్‌గా గుర్తించి బయటికి తీసుకొచ్చారు. అప్పటికే సోమశేఖర్ మృతి చెందారు. మృతునికి భార్య కల్యాణి, కుమార్తెలు హన్సిక, ధరణితో పాటు చిన్ని బాబు ఉన్నారు. కుటుంబానికి ఆసరాగా ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, భార్య రోదనలు మిన్నంటాయి.

నేడు మండల సర్వసభ్య సమావేశం

- ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి

స్థానిక మండల కార్యాలయంలో ఎంపిపి జూటూరు హేమలత అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ అల్లా బకాష్ తెలిపారు. బుధవారం మండల కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని ఎంపిటిసిలు, సర్పంచులు తప్పని సరిగా హాజరు కావాలన్నారు.



పత్తి రైతులను ఆదుకోవాలి

- మంత్రి అచ్చెన్నను కోరిన కుబేర్ నాథ్

ప్రజాశక్తి - ఆదోని

పత్తి రైతులకు ప్రయోజనం చేకూరే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చొరవ చూపాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును తెలుగు యువత రాష్ట్ర జనరల్ సెక్రటరీ, ఎపి కాటన్ మర్చంట్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బత్తిని కుబేర్ నాథ్ కోరారు. బుధవారం అమరావతిలోని సెక్రటేరియట్‌లో మంత్రి సమక్షంలో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో పత్తి సాగు విస్తీర్ణం పెరిగిందని, పంట ఆశాజనకంగా ఉందని తెలిపారు. పత్తి విక్రయానికి రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పంట ఉత్పత్తు లను రైతులు ఎక్కడైనా అమ్ముకునే వెసలుబాటు ఉందని మంత్రి చెప్పారన్నారు. కిసాన్ యాప్ ద్వారా రైతుల వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులు పొందే విధంగా అవగాహన కల్పించే చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

కషాయాల వైపు మొగ్గు చూపాలి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పంటల సాగులో కషాయాల వైపు రైతులు మొగ్గు చూపాలని ఎఒ శివశంకర్ సూచించారు. బుధవారం మండలంలోని టిఎస్.కులూరు, కె.తిమ్మాపురం గ్రామాల్లో కర్నూలు సహాయ సంచాలకులు వేదమణి, ఎఒశివ శంకర్ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నానో యూరియా, పొటాషియం నైట్రేట్ పిచికారి చేసుకుంటే కాయ, పూత, మొగ్గలు రాలిపోకుండా పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. ఎరువులు, పురుగు మందులు అధికంగా పిచికారి చేయడం వల్ల వాతావరణం, భూమి కాలుష్యమవుతుందని చెప్పారు. దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. విఎఎ జ్యోతిర్మయి, అజహార్, ఎఇఒలు నరసింహులు, వినోద్, రసూల్ పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమం గాలికి...

- పట్టించుకోని ప్రభుత్వాలు
- సహాయం కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి - కోసిగి

గంగమ్మను నమ్ముకున్న గంగపుత్రులు నదిలో నీటి బుడగల జీవన విధానం. నడుమకు చేపలు చేతిలో కర్రల సహాయంతో నదిలో ప్రాణాలకు తెగించి చేపల వేటకు వెళ్లి కడుపు నింపుకునే మత్స్య కారుల నిత్యజీవనం. ఆశల వేటలో కడుపు నింపని కులవృత్తి. భీకర నది ప్రవాహానికి అలల మధ్య మత్స్యకారుల కష్టం వర్ణనాతీతం..

కోసిగి మండలం పరిధిలోని తుంబిగనూరు, సాతనూరు కందుకూరు, కడిదొడ్డి , అగసనూరు గ్రామాల్లో చేపలు పట్టి బతికే కుటుంబాలు చాలా ఉన్నాయి. ప్రస్తుతం దాదాపు 100 మందికి పైగా ప్రభుత్వ లైసెన్సులు కలిగిన మత్స్యకారులు ఉన్నారు. కొన్ని సంవత్సరాల నుండి చేపల వేటలో పడి బతుకులు సాగిస్తున్నారు. అయినా ప్రభుత్వాలు మాత్రం ఏ ఒక్క సంక్షేమ పథకాలు అందించడం లేదని ఆగ్రహంతో పాటు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మత్స్యకారులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ద్విచక్ర వాహనాలు, వలలు, ఐస్ బాక్సులు, పెన్షన్లు, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలపై అవగాహన కల్పించి ఆదుకోవాలని మత్స్య కుటుంబాలు కోరుతున్నాయి. చేపల వేటలో నదిలో వెళ్లే సమయంలో పుట్టి అలల తాకిడికి కిందపడినా, ప్రమాదవశాత్తు మరణించినా అడిగే దిక్కే లేరని, కనీసం భద్రతా సైతం తమ మత్స్యకుటుంబాలకు ఉండవని చమర్చిన కళ్ళతో, బరువెక్కిన గుండెతో బాధను బయటికి చెప్పుకుంటున్నారు. నదిలో నీరు ఉన్నప్పుడు 20 నుండి 30 కిలోల చేపలు వేటకు వెళ్లి తీసుకొస్తామని, ఒక్కోసారి ఒక కిలో చేపలు కూడా దొరకవని అయినా పట్టు వదలకుండా కులవృత్తిని నమ్ముకున్నామన్నారు. తుంగభద్రా నది పూర్తిగా ఎండినప్పుడు తమ బతుకులు కూడా ఎండినట్టే అన్నారు. ప్రభుత్వాలు మారుతున్న మత్స్య కుటుంబాల తల రాతలు మారటం లేదని తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మత్స్యకారులకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి, మత్స్య కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నారు.



చేపలు పట్టేందుకు వలలు సిద్ధం చేస్తున్న మత్స్యకారులు

భరోసా లేని జీవితాలు మావి

- తిమ్మప్ప, మత్స్య కారుడు, అగసనూరు.



దాదాపు నేను తుంగభద్రా నదిలో పది సంవత్సరాల నుంచి చేపల వేటకు వెళ్లి చేపలు పట్టి జీవనం సాగిస్తున్నాను. నదిలో ఎక్కువగా నీటి ప్రవాహం ఉన్నప్పుడు పుట్టిల్లు మరియు వలలు కొట్టుకపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇంతవరకు నష్టపరిహారం గాని అటువంటి ఏమీ రాలేదు. నేను, మా అన్నలు, మా నాన్న వాళ్లు సైతం చేపలు పడతాం. ప్రభుత్వాలు స్పందించి మాకు సంక్షేమ పథకాలు అందించాలి.

ప్రభుత్వం నుంచి సహాయం అందలేదు

- దాసరి చిన్న స్వామి, అగసనూరు.



దాదాపు 20 ఏళ్ల నుంచి చేపలు పట్టి జీవనం సాగిస్తున్నాం. తుంగభద్ర నది లో ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద చేపల వేట చేస్తాం.ప్రభుత్వాల నుంచి ఎటువంటి సహాయం అందలేదు. మత్స్య శాఖ అధికారులు స్పందించి ఆదుకోవాలి.

ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం

- నాగరాజు, మత్స్య శాఖ అసిస్టెంట్ పర్యవేక్షకులు.

మండలంలోని నదీతీర గ్రామాలలో దాదాపు నూరు మంది వరకు లైసెన్సు కలిగిన మత్స్య కారులు ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వస్తున్న సంక్షేమ పథకాలు, కొత్త లైసెన్సులు వంటివి పేర్లు నమోదు చేసుకుంటే ప్రభుత్వానికి నివేదిక అందించి వారికి వచ్చే విధంగా కృషి చేస్తాం.

'కూటమి'లోనూ అంతేనా..?

- గ్రామీణ రోడ్లు భూమి పూజకే పరిమితం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - హోళగుంద

కూటమి ప్రభుత్వ పాలనలోనూ రోడ్ల పరిస్థితి ఇంతేనా..? అంటూ మండల ప్రజలు వాపోతున్నారు. హోళగుంద నుంచి ధనాపురం, వందవాగిలి క్రాస్ నుంచి వందవాగిలి గ్రామం వరకు, హోళగుంద నుంచి నాగరకన్వి గ్రామానికి వెళ్లాలంటే రోడ్లన్నీ గుంతలమయంగా ఉన్నాయి. హోళగుంద నుంచి ఎల్లార్తి మీదుగా ఆలూరుకు వెళ్లే రోడ్డు సైతం సగం బాగాలేదు. హోళగుంద నుంచి డివిజన్, జిల్లా కేంద్రాలకు చేరుకోవాలంటే ఎటు చూసినా 30 కిలోమీటర్లు గుంతల రోడ్లలో ప్రయాణం చేయాల్సిందే. గతంలో రోడ్లకు భూమి పూజలు చేశారు. రోడ్లు వేయడం మరిచిపోయారు. గత ప్రభుత్వంలో ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ మధ్య సఖ్యత కుదరక కాంట్రాక్టర్లు ధనాపురం నుంచి హోళగుంద రోడ్డు భూమి పూజ చేసి వదిలి వెళ్లిన విషయం అందరికీ తెలిసిందే. అప్పటి నుంచి ఆ రోడ్డుకు పట్టిన గ్రహణం ఇంతవరకు వీడడం లేదు. రోడ్ల కోసం ప్రజా సంఘాలు రాస్తారోకోలు, ధర్నాలు చేసినా ప్రభుత్వాలు, ప్రభుత్వాధికారులు పెడచెవిన పెడుతున్నారు. పరిష్కారం చూపడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. రోడ్లు బాగా లేకపోవడంతో బస్సులు ఏదో ఒక సమస్యతో మొరాయిస్తున్నాయి. ఆదోని డిపో బస్సులు తిప్పబోమని గతంలో మొండికేశారు. మండల ప్రజలు ఆర్‌టిసి అధికారులతో వాగ్వాదానికి దిగడంతో ఈ రోడ్లలో బస్సులు అటు ఇటు ఊగుకుంటూ తిరుగుతున్నాయి. వర్షాకాలంలో బస్సు డ్రైవర్, కండక్టర్ల పరిస్థితి వర్ణాతీతం. గతంలో కాంగ్రెస్ హయాంలో అప్పటి ఎమ్మెల్యే పటేల్ నిరంజన్ రెడ్డి రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. 14 ఏళ్ల క్రితం ఆదోని, హోళగుంద రోడ్డు, ఆలూరు, ఎల్లార్తి రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. గుత్తేదారులు కాసులకు కక్కుర్తిపడి నాసిరకం రోడ్లు వేయడంతో పట్టుమని పదేళు కూడా పూర్తి కాకుండానే గుంతలు ఏర్పడ్డాయి. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా ప్రజల జీవితాలు మాత్రం మారడం లేదు. ప్రస్తుతం ప్రతి సర్వసభ్య సమావేశంలోనూ ప్రజాప్రతినిధులు ఆర్అండ్‌బి అధికారులను ప్రశ్నిస్తే.. 'ఇదిగో, అదిగో' అంటూ పొంతన లేని సమాధానాలు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. సరైన రోడ్డు మార్గాలు లేక రోగులు, గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని ప్రసవాలు రోడ్డుపైనే జరిగిన సంఘటనలూ ఉన్నాయి. ప్రజల బాగు కోసం పనిచేసే ప్రభుత్వాలు, పాలకులు మరమ్మతులకు నిధులు మంజూరు చేయించి వెంటనే పనులు ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయమైన రోడ్డు

6న చలో విజయవాడ

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఆదోని



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 6న నిర్వహించే 'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. బుధవారం పట్టణంలోని భగత్ సింగ్ కార్యాలయంలో 'చలో విజయవాడ' గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు తీవ్ర ద్రోహం తలపెట్టిందని విమర్శించారు. పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీని పూర్తిగా విస్మరించారన్నారు. నూతన విద్యా విధానంతో సరళమైన మార్పులు తీసుకొచ్చి గందరగోళం సృష్టిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థలను కాపాడాల్సిన ప్రభుత్వమే కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. జిఒలతో విద్యార్థి సంఘాలను అణగదొక్కే ప్రయత్నం మానుకోవాలని తెలిపారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శశిధర్, నాయకులు సంజయ్, శివ, ఉమాకాంత్, మహేష్, భరత్ పాల్గొన్నారు.

రూ.6.39 లక్షల ఎరువులు సీజ్

ప్రజాశక్తి - మంత్రాలయం



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి రూ.6.39 లక్షల విలువ చేసే ఎరువుల బస్తాలను సీజ్ చేసి, మరో రూ.19.19 లక్షల విలువ గల ఎరువుల విక్రయాన్ని నిలిపివేసినట్లు ఎఒ జీరా గణేష్ తెలిపారు. బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం కర్నూలు వారితో కలిసి మండలంలోని కాచాపురంలోని ఎరువుల విక్రయ కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం శ్రీరామ ట్రేడర్స్ వద్ద రూ.6.39 లక్షల విలువైన 300 బస్తాల యూరియా, 20.20.0.13 400 బస్తాలను స్వాధీనం చేసుకున్నామని ఎఒ చెప్పారు. శ్రీసిద్ధి వినాయక ఆగ్రో ఏజెన్సీలు, శ్రీవీరభద్రేశ్వర ఎంటర్‌ప్రైజెస్, పంచముఖి పురుగుమందుల స్టాప్ సేల్‌ను రూ.19.19 లక్షల విలువైన ఎరువుల విక్రయాన్ని నిలిపివేసి మళ్లీ ఆదేశాలు వచ్చేవరకు ఎలాంటి అమ్మకాలూ చేయకూడదని హెచ్చరించారు. ఎస్ఐ జి.వెంకట ప్రసాద్, డిసిటిఒ వెంకట రమణ, సిఐ రామానుజులు, ఎస్ఐ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



పుస్తకాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

మండలంలోని సలకలకొండ గ్రామంలో మోడల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇన్నర్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నోట్ పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షులు రుచి మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు మాలతి, సౌమ్య, అభిరుప్ప, విట్టే శ్రీలత, శ్రావణి, కోమల, కీర్తి, గ్రామ పెద్దలు శంకరన్న, ఉపాధ్యాయులు మాధవరాజు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గుమ్మనూరు ను బర్త్ రఫ్ చేయాలి

సిఐటియు, కెవిపిఎస్

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను వెంటనే భర్త రఫ్ చేయాలని సిఐటియు ఓల్డ్ సిటీ ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు, కెవిపిఎస్ నగర అధ్యక్షులు రమణ డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం కర్నూలులోని స్థానిక జోహరాపురంలో సిఐటియు , కెవిపిఎస్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిఐటియు నగరనాయకులు సి.నాగరాజు అధ్యక్షతన జరిగిన నిరసనలో సిఐటియు ఓల్డ్ సిటీ నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు, కెవిపిఎస్ నగర అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ గుత్తి మండలంలోని భేతపల్లి గ్రామంలో సోలార్ పరిశ్రమకు చేపడుతున్న బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా రైతుల పక్షాన పోరాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి పై ఫోన్లో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం దుర్భాష లాడడం తగదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేల వ్యవహార శైలి ఇలానే ఉంటే భవిష్యత్తులో ప్రజలు ప్రతిఘటిస్తారనిపేర్కొన్నారు. వెంటనే బేషరతుగా ప్రభాకర్ రెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు గుమ్మనూరు జయరాం క్షమాపణలు చెప్పాలని వారి డిమాండ్ చేశారు. లేకపోతే ఈ ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామనిహెచ్చరించారు. సిఐటియు నాయకులు రంగస్వామి, ఎర్రమల అనిల్ , లక్ష్మన్న, యేసు, ప్రవీణ్, మధు తదితరులు పాల్గొన్నారు.



ఎర్రదొడ్డి చెరువుకు జలకల

ప్రజాశక్తి- కోడుమూరు రూరల్

ఎన్నో ఏళ్లుగా నీళ్ల ఎర్రదొడ్డి చెరువుకు విష్ణువర్ధన్ రెడ్డి,ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సహకారంతో జలకల సంతరించుకుంది. చైర్మన్ కె.చంద్రశేఖర్, డబ్ల్యుయుఎ ప్రెసిడెంట్మేకల శంకర్, తెలుగుదేశం నాయకులు గోరంట్ల మధుసూదన్ నాయుడు, ఎర్రదొడ్డి అరుణ్ కుమార్ గ్రామ ప్రజలు కలిసి కేడిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్ళగా రైతుల సమస్యలు తెలుసుకున్న ఆయన ఈ విషయాన్ని ఆదోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పాండురంగయ్య సహకారంతో కోడుమూరు సబ్ డివిజన్ డిఇ సుబ్బారాయుడు సెక్షన్ అధికారి దుర్గ భవాని, వర్క్ ఇన్‌స్పెక్టర్ మాదన్న సహకారంతో ఎర్రదొడ్డి చెరువును70 శాతం నీటిని నింపారు. సాగునీరు తాగునీరు అందించిన విష్ణువర్ధన్ రెడ్డికి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి చైర్మన్, కె చంద్రశేఖర్ , ప్రెసిడెంట్ మేకల శంకర్, తెలుగుదేశం నాయకులు గోరంట్ల మధుసూదన్ నాయుడు, అరుణ్ కుమార్ , శ్రీనివాసులు గ్రామ ప్రజలు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ తీగల ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్



కర్నూలు నగరంలో వినాయక విగ్రహాల నిమజ్జనం కార్యక్రమంలో విద్యుత్ తీగల ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల కమిషన్ చైర్మన్ దేవరశెట్టి పరమేశ్వరయ్య, రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలతలు కోరారు. బుధవారం కర్నూలు నగరంలోని రైల్వే స్టేషన్ దగ్గర ఉన్న ఎపిఎస్‌పిడిసిఎల్ పవర్ హౌస్ డివిజన్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. దేవరశెట్టి పరమేశ్వరయ్య, మీసాల సుమలత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వినాయక నిమజ్జనం కార్యక్రమాలలో విద్యుత్ తీగల వల్ల ప్రమాదాలు సంభవించాయని, కర్నూలు నగరంలో ఎలాంటి విద్యుత్ తీగల ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాముడు అక్బర్‌బాష, తెహరాబీ ,అత్తర్‌బీ, ముంతాజ్, కర్రెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వికె ఆధ్వర్యంలో విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి కర్నూలు-కలెక్టరేట్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆగస్టు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను రవీంద్ర కళాశాల, మోషన్ జూనియర్ కళాశాలలో వేర్వేరుగా జరిగిన సభల్లో సన్మానించారు.రవీంద్ర కళాశాలలో నిర్వహించిన అభినందన సభలో కళాశాల చైర్మన్ జి.పుల్లయ్య, కంటి వైద్య నిపుణులు డాక్టర్ కె.స్వాతి, ప్రజా ఆరోగ్య వేదిక కన్వీనర్ ప్రసాద్ శర్మ, సుందరయ్య విజ్ఞాన కేంద్రం సభ్యుడు ఎల్లాగువేరా, కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి పాల్గొన్నారు.డిగ్రీ , ఇంటర్ కళాశాల స్థాయిలో ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాలలో విజేతలైన ఎం.మానస, పి.వైష్ణవి, పి. శైలు భాను, కె.హరిణి, అఫియా భేగం, అర్షియా అంజూమ్, రోజా హాని, హారికలకు మెమెంటోలు అందజేశారు. అదేవిధంగా పోటీల్లో పాల్గొన్న 56 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పుల్లయ్య మాట్లాడుతూ సుందరయ్య జీవిత గాథను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన భూస్వామ్య కుటుంబానికి చెందినప్పటికీ తన ఆస్తిని సమాజానికే అంకితం చేసిన గొప్ప త్యాగం గురించి వివరించారు. యువత కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. డాక్టర్ కె.స్వాతి కంటి జాగ్రత్తలు, నేత్రదానం అవసరం గురించి అవగాహన కల్పించి, తన క్లినిక్‌లో విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రసాద్ శర్మ మాట్లాడుతూ సుందరయ్య విజ్ఞాన కేంద్రం కరోనా సమయంలో ప్రజలకు అందించిన సేవలను గుర్తు చేస్తూ, ప్రస్తుతం మెడికల్ క్యాంపులు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ మంజుల, శిరీష పాల్గొన్నారు.



విద్యార్థులకు జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేస్తున్న పుల్లయ్య , డాక్టర్ స్వాతి



విద్యార్థులకు జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేస్తున్న డాక్టర్ కిషన్, ఎల్లాగువేర


మోషన్ జూనియర్ కళాశాలలో:

సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులను మోషన్ జూనియర్ కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కర్నూలు కళాశాల డైరెక్టర్ డాక్టర్ కిషన్ మాట్లాడుతూ విద్యార్థులు పోటీల్లో ప్రతిభ కనబరిచిన తీరు అభినందనీయమని అన్నారు. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సమాజ సమస్యలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఆ దిశగా వ్యాసరచన పోటీలు ఎంతో దోహదం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రిన్సిపల్ అంజాద్ ఖాన్ మాట్లాడుతూ విద్యార్థులు రచన ద్వారా తమ ఆలోచనలను వెలిబుచ్చే అలవాటు పెంపొందించు కోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఇలాంటి పోటీలలో మరింత చురుకుగా పాల్గొని ప్రతిభను రుజువు చేసుకోవాలని విద్యార్థులను ప్రోత్సాహంచారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం సభ్యుడు ఎల్లా గువేరా మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం, సుందరయ్య ఆలోచనల ప్రేరణతో యువత సామాజిక బాధ్యతలు నేర్చుకోవాలన్నారు. విజేతలైన హర్షిత, గౌరవ గుప్తా, సార్థక్ సెల్లా, షేక్ అర్షియాలకు జ్ఞాపకాలు అందజేసి అభినందనలు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ఇతర విద్యార్థులందరికీ ప్రశంసాపత్రాలు అందజేశారు.

'అశోక'లో ఎఐసిటిఇ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అశోక మహిళా ఇంజనీరింగ్ కళాశాల, కర్నూలులో ఎఐసిటిఇ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ (ఎటిఎఎల్) అకాడమీ ప్రాయోజకత్వంలో వారం రోజులపాటు ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం (ఎఫ్డిపి) ఘనంగా ప్రారంభమైంది. క్లైమేట్ చేంజ్ అండ్ ఇట్స్ ఇంపాక్ట్స్ ఆన్ ఎనర్జీ రీసోర్సెస్ ఎ క్వాంటిటేటివ్ ఎవాల్యుయేషన్ ఆఫ్ సస్టైనబిలిటీ అండ్ రీసోర్స్ మేనేజ్మెంట్ అనే అంశంపై సెప్టెంబర్ 3 నుండి 9 వరకు జరిగే ఈ కార్యక్రమం పూర్తిగా ఆఫ్‌లైన్ మోడ్లో నిర్వహిస్తున్నారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, ఇంజనీరింగ్ కళాశాలల నుండి 60 మందికి పైగా అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు ఈ కార్యక్రమానికి నమోదు చేసుకున్నారు. పాల్గొనేవారికి ఐఐటిల, ఎన్ఐటిలతో పాటు దేశంలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు పరిశ్రమల నుండి పది మంది ప్రముఖ నిపుణులు ఉపన్యాసాలు ఇస్తున్నారు. ఈ ఉపన్యాసాల్లో కాలమాన మార్పులు, ఇంధన వనరులపై వాటి ప్రభావాలు, సస్టేయినబుల్ డెవలప్మెంట్, రిసోర్స్ మేనేజ్‌మెంట్ వంటి కీలక అంశాలను వివరించనున్నారు. అదనంగా, బోధన, పరిశోధనలో కొత్త పద్ధతులు, ప్రాయోగిక అనుభవాలు, సాంకేతికతలపై అవగాహన కల్పించనున్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. నవీన్ మాట్లాడుతూ ,కార్యక్రమం ద్వారా అధ్యాపకులు సస్టైనబిలిటీ కాన్సెప్ట్లను తమ బోధన, పరిశోధనలో అనుసంధానం చేయడానికి అవసరమైన మార్గదర్శకాలు పొందుతారన్నారు. దీంతో పాటు ఉన్నత విద్యలో సమానత్వం , నాణ్యత అనే జాతీయ లక్ష్యాలను సాధించడంలో కూడా ఇఎఫ్డిపి దోహదం చేస్తుందని తెలిపారు. కన్వీనర్ డాక్టర్ ఎస్ఎ శివకుమార్ మాట్లాడుతూ ఇలాంటి ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాముల ద్వారా ఎఐసిటిఇ ఉపాధ్యాయుల సామర్థ్యాలను పెంచుతూ, విద్యా రంగంలో కొత్త ఆవిష్కరణలు, సజనాత్మక బోధన విధానాలను ప్రోత్సహించడం వంటి కీలక పాత్ర పోషిస్తోంది. కోఆర్డినేటర్. డాక్టర్ ఏ. షరీఫ్, కోఆర్డినేటర్ డాక్టర్ బి.ఎలిజబెతమ్మ మాట్లాడుతూ ఇంత ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం నిర్వహించే అవకాశం ఇచ్చినందుకు ఎఐసిటిఇకి , అటల్‌కు ధన్యవాదాలు తెలిపారు. పాల్గొనేవారికి ఉత్తమమైన అనుభవం కల్పించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ప్రోగ్రాం ముగిసిన తర్వాత ఎవాల్యుయేషన్ టెస్ట్ నిర్వహించి, విజయవంతంగా పూర్తి చేసిన అధ్యాపకులకు సర్టిఫికేట్లు అందజేయనున్నారు.



ప్రారంభ సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.నవీన్

జిజిహెచ్ సిబ్బందితో సూపరింటెండెంట్ సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఫార్మసీ విభాగపు సిబ్బందితో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఫార్మసీ సిబ్బంది ప్రతి పేషంట్లకు సమయానికి అవసరమైన మందులు అందే విధంగా కృషి చేయాలని సూచించారు. రోగుల పట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ, వారికి అవసరమైన వైద్యసేవలు అందేలా చూసుకోవాలన్నారు. మందుల సరఫరా లో ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఫార్మసి సిబ్బందికి ఆదేశించారు. ఫార్మసీ విభాగానికి సంబంధించిన వివిధ సమస్యలు, అవసరాలు , పేషెంట్లకు మెరుగైన వైద్య సేవల అందుబాటుపై చర్చించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి, ఆయా విభాగాలలో చికిత్స పొందడమే కాకుండా, అవసరమైన ఔషధాలను సమయానికి పొందడం అత్యంత ముఖ్యమైనదన్నారు. మందుల నిల్వ, గడువు తేది, రికార్డుల నిర్వహణ, అత్యవసర ఔషధాల సరఫరా వంటి అంశాలను ఫార్మసీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరాల ప్రాధాన్యతను వివరించారు. ఉచిత ఔషధాల పంపిణీ లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకునేలా ఉండాలని ఫార్మసి సిబ్బందికి ఆదేశించారు. ఫార్మసీ విభాగంలో సివిల్‌వర్క్ పనులకు సంబంధించిన వాటిపై పర్యవేక్షణ చేయాలని సంబంధించిన సివిల్ ఇంజనీర్లను ఆదేశించినట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ఆసుపత్రి ఇన్చార్జి సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, ఫార్మసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శారద, ఆసుపత్రి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివబాల, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్ కుమార్, ఇంచార్జ్ ఎఆర్ఎంఒ డాక్టర్ సునీల్ ప్రశాంత్, ఫార్మసీ విభాగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

